వంతెన నిర్మాణం చేపట్టండి

వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సూచిస్తున్న జైనూర్ పల్లె గిరిజనులు

బోథ్ మండలం జైనూర్ పల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో వాగుపై వంతెన లేక ఆదివాసీ గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిన వాగులో ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో దాటలేకపోతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటితో పాటు పొలాల నుంచి వచ్చే వరదతో వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకోని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

–బోథ్, ఆగస్టు 25

అధిక వర్షాలతో పంటలకు నష్టం

● ఆందోళన చెందుతున్న రైతులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 25 : అధిక వర్షాలు రైతుల ఆశలను నీటిపాలు చేశాయి. జూన్ నుంచి నేటి వరకు మండలంలో మొత్తం 841.4 మి.మీ వర్షపాతం నమోదైందని రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని గిన్నేరా. కేస్లాపూర్, కేస్లాగూడ, ముత్నూర్, వాల్గొండా, హీరాపూర్, డోంగర్‌గాం, వడగాం, పిట్టబొంగురం, దస్నాపూర్ గ్రామాల శివారులోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూముల్లో అధికంగా వర్షపు నీరు చేరి పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. పత్తి, సోయాబిన్, మొక్కజొన్న, వరి, కంది పంటలు పసుపు రంగులో మారి పూర్తిగా ఎదుగుదల ఆగిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడగా పంట భూముల్లో చేరిన నీటిని తొలగించాలన్నారు. అధికంగా నీరు పట్టే భూములకు చుట్టు కాలువలు తీసి నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

పసుపు రంగుగా మారిన మొక్కజొన్న పంట



అధిక వర్షాలతో రంగుమారిన పత్తి పంట

మాతా రమాబాయి అంబేద్కర్ అధ్యక్షురాలిగా దయాశీల

దయాశీలను సన్మానిస్తున్న సభ్యులు

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్ బుద్ధవిహార్‌లో మాతా రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్షురాలిగా కొనసాగిన చంద్రకళ వాఘ్మారే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. బుద్ధవిహార్‌లో ముందుగా గౌతమ బుద్ధుడికి పూజలు చేసిన అనంతరం అధ్యక్షురాలిగా దయాశీల హుకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దయాశీలను పలువురు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రుక్మాబాయి, కుశ్వర్తబాయి లాండ్గే, పుష్పలత, ఇందుబాయి, రాధాబాయి, కరుణ, తదితరులు పాల్గొన్నారు. అందరిని కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేసేలా కృషి చేస్తానని దయాశీల హుకే తెలిపారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామంలో మున్నూరు కాపు యువత, ఉద్యోగ సంఘాల ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అంకొలి మున్నూరు కాపు గ్రామ సంఘం అధ్యక్షుడిగా పూదరి రాహుల్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రం రాహుల్, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడిగా ఎర్రం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి హరిదాస్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎర్రం నర్సింగ్‌రావు, కనక రమణ, పూదరి చంద్రశేఖర్, కృష్ణ, నవీన్, నర్సింగ్, పోశెట్టి, ఎర్రం అశోక్, సురేశ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి యువకుల చేయూత

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ కాలనీకి చెందిన ముదాం సురేశ్ రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇంటి వద్దనే ఉండడంతో పోషణకు కష్టమైంది. భార్య గీత ఆరుగురు ఆడపిల్లలను పోషించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఆ కాలనీకి చెందిన నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఆదివారం యూత్ ఆధ్వర్యంలో సురేశ్ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినోద్ కుమార్, రాజేందర్, కరుణాకర్, సుధీర్, ప్రేమ్‌విశాల్, రమేశ్, జైపాల్, దుర్గ ప్రసాద్, ప్రమోద్, లెనిన్, రవీందర్, మహేశ్, మహేందర్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను నమ్మే ప్రసక్తే లేదు

ఉద్యోగం సాధించిన అపర్ణ, తల్లిదండ్రులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, ఆగస్టు 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ బూటకమని..యువత నమ్మే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన ఖ్యాతం అపర్ణ ఏఈఈ ఫలితాల్లో సత్తాచాటి మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈ ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. ఆదివారం ఆమె నివాసానికి చేరుకొని ఉద్యోగం సాధించిన అపర్ణ, తల్లిదండ్రులు రమేశ్, వెంకటమ్మలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్యతో పాటు ఉద్యోగ నోటిఫికేషన్లు అందించడంతో ఆ సత్ఫలితాలను నేటి విద్యార్థులు అందుకోగలుగుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను యువత నమ్మే పరిస్థితిలో లేరని అది ఒక బూటకమని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో 2022-23లో వచ్చిన నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించడం జరిగిందని తెలిపారు. విద్యపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించినట్లయితే ఇలాంటి మరెన్నో విజయాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పందిరి భూమన్న, అశోక్ స్వామి, గోలి శంకర్, చెన్నై సాయి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలి

వృద్ధులకు సంబంధించిన పుస్తకాన్ని అందజేస్తున్న సాయి వైకుంఠ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్

ఎదులాపురం, ఆగస్టు 25 : వృద్ధుల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని సాయి వైకుంఠ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ట్రస్టు భవనంలో వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వయోవృద్ధుడిని సత్కరించారు. ఈ సందర్భంగా సాయివైకుంఠ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ కుటుంబ విలువలున్న దేశంలో నేడు విచ్ఛనం కారణంగా పిల్లలు విడిపోతున్నారన్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధుల్లో సమస్యలు మొదలవుతున్నాయన్నారు. వీటిని గుర్తించి పరిష్కరించేలా సంఘం ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వమే కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వయోవృద్ధుల సమాఖ్యకు తమ వంతు పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్ దేశ్ పాండే సంఘం తరపున చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంకులకర్ణి, ఉపాధ్యక్షుడు శీల కిషన్, కోశాధికారి శేషగిరిరావు, అప్సఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

లక్ష్మణచాంద: పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద, ఆగస్టు 25 : లక్ష్మణచాందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ఊరంతా ర్యాలీగా తిరిగి సభ వేదికకు చేరుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు స్వాగతం పలికారు. నాటి అనుభావాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగారెడ్డి, వెంకటరమణ, రాఘవరెడ్డి, వినోద్‌కుమార్, సుభాష్, శ్రీనివాస్, లింగన్న, వేణు, రాజేశ్వర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ): ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నర్సాపూర్(జీ), ఆగస్టు 25 : నర్సాపూర్(జీ)లోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

జైనథ్: వాగ్దేవి పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

జైనథ్/సోన్/భైంసా, ఆగస్టు 25: జైనథ్‌లోని వాగ్దేవి ప్రాథమికోన్నత పాఠశాల, సోన్‌లోని అభ్యాస గురుకుల పాఠశాల, భైంసాలోని సర్వేశ్వర పాఠశాలలో ముందస్తుగా ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టారు. నృత్యాలు చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్ లింగన్న, అభ్యాస గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ముందాడ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య దీక్ష

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 25 : నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఇంటి ఎదుట భార్య ఆదివారం దీక్ష చేపట్టింది. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో పుట్టింటికి వెళ్లింది. తనను కాపురానికి తీసుకెళ్లడం లేదని కోర్టును ఆశ్రయించింది. దీంతో 20 రోజుల క్రితం భార్యను కాపురానికి తీసుకెళ్లాలని కోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ తీసుకెళ్లకపోవడంతో భర్త ఇంటి ఎదుట దీక్ష చేపట్టింది.

విద్యుత్ షాక్‌తో దూడ మృతి

దిలావర్‌పూర్, ఆగస్టు 25 : దిలావర్‌పూర్ మండలం మాడెగాం గ్రామంలోని పుల్లోల్ల శ్రీనివాస్‌కు చెందిన ఆవుదూడ ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ పరిసర ప్రాంతంలో మేతకు కోసం వెళ్లిన దూడ పంట పరిసరాల్లో తెగి పడిపోయిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందిందని ఆయన తెలిపారు. దీని విలువ దాదాపు రూ.25 వేల వరకు ఉంటుందని తనకు సంబంధిత శాఖ తరపున న్యాయం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

నర్సాపూర్(జీ), ఆగస్టు 25 : నర్సాపూర్(జీ) గ్రామానికి చెందిన చిన్న నాటి మిత్రురాలు గడ్డం సరిత భర్త ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి 1999-2000 సంవత్సరం పూర్తి చేసుకున్న మిత్రులందరూ కలిసి ఆర్థిక సాయంగా రూ.42,500 అందజేశారు.

అక్షరదానం పారితోషికం



పారితోషికం అందుకున్న విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 25 : అక్షరమాల నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటు చేసిన అక్షర దానం కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన పాత ఎల్లాపూర్, బోసి విద్యార్థులు ప్రతిభ చాటి పారితోషికం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా పాత ఎల్లాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎలగందుల అఖిల, బోసి పాఠశాలకు చెందిన బుట్టి లక్ష్మి రూ. 5000 పారితోషికం అందుకున్నారు. కార్యక్రమంలో పీజీ హెచ్ఎంలు రమాదేవి, రాజశేఖర్ ఉన్నారు. విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఓసీ సంఘాలకు తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఓసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్

ఎదులాపురం, ఆగస్టు 25 : తీన్మార్ మల్లన్న ఓసీ సంఘాలపై చేసిన వ్యాఖ్యలను సరికాదని ఓసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగాం సంతోష్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓసీ సంఘాలకు కల్పించిన రిజర్వేషన్ వల్ల వేరే కులాలు నష్టపోతున్నారని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడానికి తీన్మార్ మల్లన్న ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే తీన్మార్ మల్లన్న ఓసీ సంఘాలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఓసీ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రపుల్ వర్మ, శివకిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

రిమ్స్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



రోగులను పరామర్శిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ ఆదివారం సందర్శించారు. చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు అందిస్తున్న భోజనం, గుడ్లు, ఇతర ఆహారపదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు క్రమం తప్పకుండా వైద్యం, భోజనం అందించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి ఉన్నారు.

వస్తువుల తొలగింపు



మూడో అంతస్తులో మంచాలను తొలగిస్తున్న సిబ్బంది

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్ రిమ్స్ అధ్వాసం ఆదివారం 'నమస్తే తెలంగాణ' లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మూడో అంతస్తులోని ఇనుప మంచాలు, పరుపులు, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఉంచిన గుట్కాను శుభ్రం చేశారు. రిమ్స్ పరిశుభ్రత పనులు నిర్వహించే శ్రీ కృష్ణ కన్‌స్ట్రక్షన్ శానిటేషన్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ శానిటేషన్ పనులు చేయాల్సి ఉంటుందని కొన్ని పరిసరాల్లో పరిశుభ్రత పాటించకపోవడం వల్ల అశుభ్రత ఏర్పడిందని ఆయన తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకుల నుంచి రాతపూర్వక సమాధానం కోరినట్లు తెలిపారు.

గుట్కా పట్టివేత

బోథ్, ఆగస్టు 25 : మండలంలో అక్రమంగా గుట్కా సరఫరా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఆదివారం దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కన్గుట్ట గ్రామ సమీపంలో గుట్కా సరఫరా చేస్తున్న ఇచ్చోడకు చెందిన షేక్ షాజీద్ పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గుట్కా విలువ రూ.27,611 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సొనాల వీడీసీ సమావేశం

బోథ్, ఆగస్టు 25: మండలంలోని సొనాల గ్రామాభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆదివారం వీడీసీ అధ్యక్షుడు తుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. వీడీసీ ఆదాయ జమ ఖర్చులపై చర్చించారు. దసరా సెలవుల్లో వీడీసీ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. మొండి బకాయిల వసూళ్లను సెప్టెంబర్ 2వ తేదీలోగా చెల్లించాలని బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. సమావేశంలో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

ఏఎస్పీ, పట్టణ సీఐని సన్మానిస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

భైంసా, ఆగస్టు 25 : శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. ఆదివారం భైంసాలో హిందూ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని, అంతేగాకుండా పోలీసులకు సైతం సహకరించాలని కోరారు. అనంతరం ఏఎస్పీ, పట్టణ సీఐ, ఎస్ఐలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, సభ్యులు కపిల్, దత్తాత్రి, మల్లేశ్, తోట విజయ్, గాలి రాజు, డాక్టర్ నగేశ్ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

కుభీర్, ఆగస్టు 25: కుభీర్‌లో మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్న ముచ్చింద్ల విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఆదివారం బెల్ట్ షాపును తనిఖీ చేయగా అక్రమ మద్యం దొరికినట్లు తెలిపారు. 30 దేశీదారు సీసాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. దీని విలువ సుమారు రూ.1640 ఉంటుందని వివరించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 25 : నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కళాశాలలో శ్రీ అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్, ప్రసన్న హరికృష్ణ విన్నర్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు తేలు శ్రీనివాస్, కసపర్తి విఘ్నేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గాన్ని అనుసరించకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 1500పైగా ఉద్యోగాలతో 50 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. నిరుద్యోగులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మసీదు రాజాగౌడ్, జాప ప్రకాశ్, మారుతి, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, అయ్యప్ప భక్తులు, దీక్ష కళాశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఇచ్చోడ, ఆగస్టు 25: ఏజెన్సీ ప్రాంత రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీన నిర్వహించే ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ బిర్‌గోండ్ తోటి సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని వెడ్మ రాము చౌక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక డీఎస్సీ జీవో నంబర్ 3 అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర డిమాండ్లతో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ బిర్‌గోండ్ తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్, పవన్‌కుమార్, కాత్లే సాయి, మారుతి, నరేందర్, భుమేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ముథోల్‌లో కబడ్డీ పోటీలు

ముథోల్, ఆగస్టు 25 : ముథోల్‌లో సోమవారం నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు హిందూవాహిని ముక్తపూర్ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కబడ్డీ పోటీలను శ్రీ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 9573989374, 9154997747 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధిత రైతుకు పరామర్శ

రైతుతో మాట్లాడుతున్న శ్రీధర్

బోథ్, ఆగస్టు 25 : బోథ్ మండలం పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన తొడసం ఆనంద్‌రావ్ ఎలుగుబంటి దాడిలో శనివారం గాయాలయ్యాయి. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న బోథ్ సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రిమ్స్‌కు వెళ్లి ఆనంద్‌రావ్‌ను పరామర్శించారు. రైతును అటవీ శాఖాధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు భీంరావ్, బండారు స్వామి, మడావి రాజు ఉన్నారు.

మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌కు తరలింపు

కుంటాల, ఆగస్టు, 25: ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని అంబకంటితండా పరిధిలోని రాయపాడ్ తండాలో ఇటీవల జరిగింది. జ్ఞానేశ్వర్ అనే రైతు రిజర్వు ఫారెస్టుకు చెందిన భూమిలో పంటను సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ ఫారెస్టు అధికారులు పశువులతో పంటను మేయించారని బాధితుడు గోడు వెల్లబోసుకున్నారు. పంట నష్టంతో మనస్తాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే భైంసాలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా డాక్టర్ల సూచన మేరకు బాధితుడు ప్రస్తుతం మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తలమడుగు ఎస్ఐగా అంజమ్మ

తలమడుగు, ఆగస్టు 25 : తలమడుగు ఎస్ఐగా అంజమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అంజమ్మ బదిలీపై తలమడుగుకు వచ్చారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

బోథ్, ఆగస్టు 25 : సాయినగర్, సాకేరా గ్రామాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు రవి, జాదవ్ భారత్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, కదం ప్రశాంత్, రాజేశ్వర్, అప్కా కిషన్, వెంకన్న, విష్ణు, నాయకులు ఉన్నారు.

హిందీ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

మాట్లాడుతున్న హిందీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఎదులాపురం, ఆగస్టు 25 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందీ భాష పండితులంతా కలిసి సెప్టెంబర్ 20వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే పిలుపునిచ్చారు ఆదివారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఉద్యోగోన్నతులు పొందిన 100 మంది హిందీ పండితులను హిందీ సేవా సమితి తరపున సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గేయాలు, చిత్రలేఖన పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, ఉపాధ్యక్షుడు రవి జాబాడే, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్